క్లుప్తంగా

నేడు హనుమాన్ శోభాయాత్ర

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎల్కపల్లిలోని శ్రీ వీరహనుమాన్ శోభాయాత్ర ఉదయం 10 గంటలకు ప్రారంభంకానుంది. ఎల్కపల్లి, కొత్తగూడ హనుమాన్ ఆలయం మీదుగా ఎల్కపల్లి చేరుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కెరమెరి: మండలంలోని బారేమోడి గ్రామానికి చెందిన వాడై అజయ్‌కుమార్‌కు ఆసిఫాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ శుక్రవారం జిల్లా కేంద్రంలో రూ. 60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట బాలకృష్ణ, అబ్బు, వెంకటేశ్ ఉన్నారు.

పాఠశాలల సందర్శన



విద్యార్థిని చదివిస్తున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి: మండలంలోని లక్మాపూర్, దేవాపూర్ పాఠశాలలను శుక్రవారం ఎంఈవో ఆడే ప్రకాశ్ సందర్శించారు. పాఠశాల గదులతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులతో చదివించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ఎఫ్ఏ 1, 2, 3, 4 ఎస్ఏ 1 మార్కులను ఐఎస్ఎంఎస్ పోర్టల్లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎస్ఏ 2 పరీక్షలు పూర్తికాగానే ఆ గ్రేడ్‌లను కూడా అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లత

కెరమెరి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత అన్నారు. శుక్రవారం మండలంలోని రింగన్‌ఘాట్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆకుకూరలు, కూరగాయలు అధికంగా తీసుకోవాలన్నారు. రెండేళ్లలోపు చిన్నారులు ఎత్తు, బరువు తీసి గ్రోతింగ్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సుజాత, లింగుబాయి, సుభాషిని, శకుంతల, శ్యామల, అమృత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ కమలాకర్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ప్రత్యేక యాప్

ఆసిఫాబాద్: విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం టీజీఎన్‌పీడీసీఎల్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ రాథోడ్ శేషారావు ఒక ప్రకటనలో తెలిపారు. యాప్‌లో పే బిల్స్, బిల్ హిస్టరీ, ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ, కొత్త సర్వీస్ స్థితి, ఫీడ్‌బ్యాంక్, మై అకౌంట్‌తోపాటు 20 రకాల సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. వినియోగదారులు యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: వరంగల్ పట్టణంలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ పోస్టర్‌ను మండల కన్వీనర్ బిట్టి శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల తెలంగాణ పాలనలో బడుగు బలహీనవర్గాలకు ఎంతో మేలు జరిగిందన్నారు. వరంగల్ సభకు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజవర్ధన్, రవి, గంగారాం, దేవిదాస్, తొగయ్య, సుధాకర్, సురేశ్, బాబులాల్ పాల్గొన్నారు.

జ్యోతిబా పూలేకు నివాళి



కాగజ్‌నగర్ రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: మహాత్మా జ్యోతిబా పూలే, బీఆర్ అంబేడ్కర్‌లు సామాజిక విప్లవకారులని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి అన్నారు. పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగం–సామాజిక న్యాయం అనే అంశంపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు చాపిలె సాయికృష్ణ, సాయి, ప్రీతి, రాజ్ కమలాకర్ రెడ్డి, మహిపాల్, బాజీఖాన్ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు మాట్లాడుతూ పూలే ఒక గొప్ప సామాజిక న్యాయ సంఘకర్త, కుల వివక్షతపై పోరాడిన మేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో ముంజం శ్రీనివాస్, త్రివేణి, శ్రీకాంత్, బాలకిషన్, శంకర్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: సామాజిక విప్లవనేత జ్యోతిబా పూలే స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాటం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జ్యోతిబా పూలే జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, కొరెంగ మాలశ్రీ, గెడం టీకానంద్ పాల్గొన్నారు.

కౌటాల: మహాత్మా జ్యోతిబా పూలే మాలీ కులస్తుల మహాత్ముడని మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్ రావ్ అన్నారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకొని పూలే విగ్రహానికి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శి వసంత్‌రావ్, ఆదే నాందేవ్, నికాడే గంగారాం, సెండే నాందేవ్, కుంచాల విజయ్, ఆదే శ్రీనివాస్, మొర్లె రమేశ్, నిహారిక పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. డీఎం రాజశేఖర్ కార్మికులతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద సమతాభారత్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. జాడి ఆనంద్‌రావు, డోంగ్రి ప్రవీణ్ కుమార్, జాడి కృష్ణ, చంద్రి పెంటయ్య, దుర్గం సుధాకర్ పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తు ప్రసాద్, మాలీ సంఘం అధ్యక్షుడు కాంబ్డే తుల్సీరాం, ఆదే శ్యాంరావు, వాడై సోనేరావు, పెందోర్ మోతీరాం పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని పూలే విగ్రహం వద్ద మాలీ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలతో ఘన నివాళులర్పించారు. అణగారిన వర్గాల కోసం మహాత్మా జ్యోతిబా పూలే తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్సై పోశెట్టి, గుర్నులె నారాయణ, విలాస్ ఖోబ్రగడె, అశోక్ మహోల్కర్, బొట్టుపల్లి జైరాం పాల్గొన్నారు.



రెబ్బెన: పూలమాల వేస్తున్న విజయ భాస్కర్‌రెడ్డి

దహెగాం: మండలంలో ఇట్యాల గ్రామంలో శుక్రవారం పూలే జయంతిని మాలీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలీ సంక్షేమ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు వశాకె భీంరావ్ ఆధ్వర్యంలో ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఎగురవేశారు. నాయకులు మొర్లె నగేశ్, తిరుపతి, భీమయ్య, మురారి, శంకర్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: పూలే సేవలు చిరస్మరణీయమని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ ఆవరణలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏరియా బీసీ లైజన్ అధికారి మధుకుమార్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, మచ్చగిరి నరేందర్, ఉమాకాంత్, పేరం శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్: ఆర్టీసీ డిపోలో..



కెరమెరి: నివాళులర్పిస్తున్న నాయకులు



వాంకిడి: నినాదాలు చేస్తున్న నాయకులు



జెండా ఎగురవేస్తున్న నాయకులు

శివాలయం నిర్మాణానికి భూమిపూజ

సిర్పూర్(టి): మండలంలోని పూసిగూడ గ్రామంలోని ఆంజనేయాలయం ప్రాంగణంలో శుక్రవారం అమ్మ శ్రీకాంత్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నూతనంగా శివాలయం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముందస్తు హనుమాన్ జయంతి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ హనుమాన్ ఆలయంలో ముందస్తు హనుమాన్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రాంచందర్ మసాదె ఆలయంలో ధ్వజారోహణ చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. జయంతికి ఒక రోజు ముందుగా వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేసి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో హనుమాన్ స్వాములు రవి, సుధాకర్, మహేశ్, శేఖర్, రాజన్న, తిరుపతి, సురేశ్, స్వాములు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

కాగజ్‌నగర్ రూరల్: గావ్ చలో, బస్తీ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని సర్దార్‌బస్తీలో అంగన్‌వాడీ కేంద్రాలను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ బీజేపీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పేదలకు చేరే విధంగా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈనెల 14న నిర్వహించే అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేసి అంబేడ్కర్ అడుగుజాడల్లో నడువాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తపల్లి శ్రీనివాస్, విశ్వేశ్వర్, రాణి, గజ్జల లక్ష్మణ్, అరుణ్‌లోయా, ప్రశాంత్, కృష్ణస్వామి, తిరుపతి, అర్జున్, సౌరబ్, విజయ్, కిరణ్, కిషన్ పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి ముస్తాబు

- మరో కొండగట్టుగా విరాజిల్లుతున్న కేస్లాపూర్
- నేడు హనుమాన్ జయంతి
- అన్ని ఏర్పాట్లు పూర్తి

ఆసిఫాబాద్‌అర్బన్: నేడు హనుమాన్ జయంతికి జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంతో పాటు మండలంలోని హనుమాన్ ఆలయాలు విద్యుత్ దీపాలతో ముస్తాబు అయ్యాయి. జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరంజనేయస్వామి ఆలయం, బజార్‌వాడీ, కంచుకోట, హీరాపూర్, టీఆర్‌నగర్, బ్రాహ్మణవాడ, జన్కాపూర్, గంగపుత్రకాలనీల్లో కమిటీ ఆధ్వర్యంలో జయంతి ఏర్పాట్లను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేశారు.

నేటి పూజా కార్యక్రమాలు..

జయంతిని పురస్కరించుకొని నేడు కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమై, 5.30 కలశ గణపతి పూజ, పుణ్యావచనం, అఖండ దీపారాధన, 6 గంటలకు ధ్వజారోహణము, హారతి, 6.30కి నవగ్రహ స్థాపన, పూజా, 7.30కి శ్రీ ఆంజనేయ స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 8.30కి సహస్ర తమలాపత్ర, సహస్ర ఫల పుష్పార్చన, 9 గంటలకు నవగ్రహ, రుద్రహోవనము, బలిహరణ ము, పూర్ణాహుతి, 9.40కి మంగళ హారతి, మహా మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, 10 గంటల నుండి మహాప్రసాద (అన్నదానం) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.



ముస్తాబైన కేస్లాపూర్ హనుమాన్ ఆలయం

రాజీవ్ యువ వికాసంపై అవగాహన కల్పించాలి

వాంకిడి: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో రాజీవ్ యువ వికాసం పథకంపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు పెట్టుబడి సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందిస్తుందన్నారు. అలాగే జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి 100 రోజులు పని కల్పించాలన్నారు. నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజా అజీజుద్దీన్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ శైలేదర్, ఏపీవో శ్రావణ్ కుమార్, ఈసీ మోసిన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

అంబేడ్కర్ జయంతికి ఆహ్వానం

రెబ్బెన: ఈనెల 14న నిర్వహించే బీఆర్ అంబేడ్కర్ జయంతికి హాజరు కావాలని శుక్రవారం అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు రెబ్బెన సీఐ బుద్దె స్వామితో పాటు, ఎస్సై చంద్రశేఖర్‌లకు ఆహ్వాన పత్రిక అందచేశారు. యువజన సంఘం నాయకులు దుర్గం సంతోష్, కామ్రె కిషన్, దుర్గం రవీందర్, దుర్గం వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

మాలీ కులస్తుల ఆందోళన

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో మాలీ కులస్తులు ఏర్పాటు చేసుకున్న మాలీ సంఘం భవన నిర్మాణానికి జెండాలు ఆవిష్కరించిన జెండాలను గుర్తు తెలియని వ్యక్తుల తొలగించారని నిరసనగా శుక్రవారం మండలంలోని మాలీ సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా నుంచి స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.

స్కూటీ దొంగతనాన్ని ఛేదించిన పోలీసులు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో స్కూటీ దొంగతనం కాగా పోలీసులు శుక్రవారం ఛేదించారు. ఈనెల 11న దొంగతనానికి గురైందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని, అయితే దర్యాప్తులో గాంధీనగర్‌కు చెందిన ఇద్దరు మైనర్లు దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించామని సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్కూటీని స్వాధీనం చేసుకుని నిందితులను జువెనైల్ కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్‌లో శుక్రవారం చలివేంద్రాన్ని ఎస్సై ఇస్లావత్ నరేశ్ ప్రారంభించారు. బీజేపీ నాయకులు చాప్లె సుధాకర్ తనతల్లి చాప్లె రుషక్క స్మారకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎస్సై మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిర్యాణి: ప్రజల దాహార్తి తీర్చేందుకు పోలీసుశాఖ తమ వంతు ప్రయత్నం చేస్తుందని సీఐ బుద్దె స్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై ఎంబడి శ్రీకాంత్, ఏఎస్సై నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్: ఆర్యవైశ్యుల సేవలు ప్రశంసనీయమని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అన్నారు. శుక్రవారం పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆర్యవైశ్యుల సేవలు ఎప్పటికీ మరువలేనివని కొనియాడారు. జిల్లా అధ్యక్షుడు నగేశ్వర్‌రావు, చిలువేరు సత్యనారాయణ, కాసం శ్రీనివాస్, రాచకొండ గిరీశ్, సతీశ్, పుల్లూరు సంతోశ్, శంకరయ్య, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

కౌటాల: ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని కౌటాల ఏపీవో పూర్ణిమ అన్నారు. మండలంలోని గుడ్లబోరి గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కూలీలు నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ వంద రోజుల పని దినాలు పూర్తి చేయాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలన్నారు. ఆమె వెంట ఎఫ్ఏ సోమయ్య, సిబ్బంది సురేశ్, దావులత్, నరేశ్, బాబురావు, లింగయ్య, కామ్రె వసంత్‌రావు, రంజిత్ పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఫొటోను ఏర్పాటు చేయాలి

రెబ్బెన: మండలంలోని రేషన్ షాపుల వద్ద ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ రామ్మోహన్‌రావుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న బియ్యంలో ఒక్కొక్కరికి కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా 5 కిలోల చొప్పున పంపిణీ చేస్తోందన్నారు. బియ్యం సరాఫరాలో మొత్తం సబ్సిడీ భారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పసుపులేటి మల్లేష్, కోకన్వీనర్ రామగిరి సతీష్, మంజుల వెంకన్న, నాయకులు రాజేశ్, శంకర్ పాల్గొన్నారు.

వెదురు మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న డీపీఎం సారయ్య

కెరమెరి: గ్రామాల్లో ఆసక్తి ఉన్నవారు వెదురు మొక్కలు నాటాలని ఐకేపీ డీపీఎం సారయ్య అన్నారు. మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 15 గుంటల స్థలం ఉండి ఆసక్తి చూపిన వారికి 60 మొక్కలు అందజేస్తామని తెలిపారు. మొక్కలతోపాటు ఎరువులు ఉచితంగా పంపిణీ చేస్తామని, గుంతలు తవ్వడం, నాటడం వంటి పనులకు ఉపాధిహామీ పథకం కింద డబ్బులు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

కౌటాల: మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్యవేశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో మహా చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి భాగవతం ప్రవచన కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక చేశారు. అనంతరం ఆలయంలో ప్రవచకులు బ్రహ్మ శ్రీ ఫణతుల మేఘరాజ్ శర్మ, ఫణిగంటి కిరణ్‌శర్మ సమక్షంలో చండీహోమం నిర్వహించారు. వారం రోజుల పాటు నిర్వహించిన భాగవతం ప్రవచన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వొజ్జల వెంకన్న, కమిటీ సభ్యులు ప్రశాంత్, మనీశ్, ప్రకాశ్, అనిల్, శ్రావణ్ పాల్గొన్నారు.



చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

‘బీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి’

రెబ్బెన: సింగరేణిలో పని చేస్తున్న బీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో శుక్రవారం సింగరేణి బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జెండా గద్దెను ప్రారంభోత్సవం, జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. అంతకు ముందు బీసీ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింగరేణిలోని అన్ని సంఘాలు అభివృద్ధికి సహకరిస్తామన్నారు. జీఎంను బీసీ ఎంప్లాదయీస్ అసోసియేషన్ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీసీ లైజన్ అధికారి మధుకుమార్, ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు మొగిళి, పంజాల శ్రీనివాస్, కైరిగూడ పీవో నరేందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు, పత్తెం రాజాబాబు, శ్రీకాంత్, గోలెం గట్టయ్య, మెరుగు రమేశ్ పాల్గొన్నారు.



విజయ భాస్కర్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

కౌటాల: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం దండె రాంప్రసాద్‌రావు ఆధ్వర్యంలో కౌటాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేయగా ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమన్నారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, నాయకులు నికాడే గంగారాం, ఉమా మహేశ్, విఠల్, నాహీం, గట్టయ్య, భాస్కర్, పోశం, ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కోయగూడలో పోషణ పక్వాడ

కౌటాల: మండల కేంద్రంలోని కోయగూడ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు ప్రతినెలా బరువు పరిశీలించుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు జీజాబాయి, సుజాత, భూదేవి, రమా, విజయ, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

‘రాజ్యాంగం జోలికొస్తే ఊరుకోం’

బెజ్జూర్: భారత రాజ్యాంగం జోలికొస్తే ఊరుకునేది లేదని జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ మండల కన్వీనర్ కొడుప విశ్వేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద సిద్దాపూర్, చిన్న సిద్దాపూర్ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. రాజ్యాంగం, అంబేడ్కర్ పట్ల బీజేపీ, ఆర్ఎస్ఎస్ పార్లమెంట్‌లో అవహేళన చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, పెద్దల శంకర్, సురేశ్‌గౌడ్, మెరుగు రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, ప్రజలు